క్లుప్తంగా

ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో అత్యాధునిక పరికరం



లబ్బీపేట(విజయవాడతూర్పు): భయం, ఆందోళన కలిగిన చిన్న పిల్లలకు మెరుగైన, ప్రత్యేకమైన దంత వైద్యం అందించేందుకు కాన్షియస్ సెడేషన్ అనే పరికరాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ దంత వైద్య కళాశాలకు అందజేసింది. చిన్న పిల్లల దంత వైద్య విభాగంలో (పీడోడాంటిక్స్) ఆ పరికరం కంపెనీ సాంకేతిక సిబ్బంది వచ్చి బుధవారం అమర్చారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని శ్రీనివాసరావు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భయం వలన చాలా మంది పిల్లలు దంత వైద్యాన్ని నిరాకరిస్తారన్నారు. అలాంటి పిల్లలకు తేలికపాటి మత్తు ఇచ్చే ఈ పరికరం చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీడోడాంటిక్స్ విభాగాధిపతి డాక్టర్ జి.జేసుదాస్, డాక్టర్ సురేఖ, డాక్టర్ సుధాకర్, డాక్టర్ సునీత, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాగిన హెయిర్ స్టయిల్ పోటీలు



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక మధుచౌక్‌లోని మొగల్ ఎగ్జిబిషన్ హాలులో జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో మహిళా ఉత్సవ్–2024లో భాగంగా బుధవారం సాయంత్రం హెయిర్ స్టయిల్ పోటీలు నిర్వహించారు. 14 మంది మహిళలు వివిధ మోడల్స్‌లో హెయిర్ స్టయిల్స్‌ను ప్రదర్శించారు. వీరిలో మొదటి బహుమతిని జి.భావన, ద్వితీయ బహుమతిని పి.లక్ష్మీప్రసన్న పొందారు. జన శిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ ఎస్.విద్యాకన్నా, డైరెక్టర్ ఎ.పూర్ణిమ విజేతలకు బహుమతులు అందజేశారు. జనశిక్షణ సంస్థాన్ సీనియర్ రిసోర్స్ పర్సన్ ఓ.భవానీ, ఎస్.సునీత పోటీల న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. నేడు గురువారం సాయంత్రం 4 గంటలకు మహిళా పారిశ్రామిక వేత్తల సన్మానం చేస్తామని చెప్పారు.

మహిళలకు జీవనోపాధి కల్పించటమే ప్రభుత్వ లక్ష్యం



భవానీపురం(విజయవాడపశ్చిమ): మహిళలకు సుస్థిర జీవనోపాధి కల్పించటమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని మెప్మా మేనేజింగ్ డైరెక్టర్ వి. విజయలక్ష్మి తెలిపారు. అందుకుగాను పట్టణ ప్రగతి యూనిట్లు, ఆహా క్యాంటీన్లు, జగనన్న మహిళా మార్ట్‌లు, జగనన్న ఈ–మార్ట్‌లు, బ్యూటీషియన్ కోర్స్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని చెప్పారు. బ్యూటీషియన్ కోర్స్‌లో అనూస్ సంస్థ ద్వారా ఉచిత శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని విజయవాడలో ప్రారంభించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అనూస్ సీఈఓ అనురాధ, కృష్ణా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ పి. వెంకట నారాయణ, మెప్మా ఏఓ రామాంజనేయులు, మెప్మా ఎస్ఎమ్ఎంలు ఆదినారాయణ, ఎస్ఎస్ఆర్ శ్రీనివాస్, రంగాచార్యులు, వీఎంసీ మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తిపై కత్తితో దాడి

కృష్ణలంక(విజయవాడతూర్పు): మద్యం మత్తులో నలుగురు వ్యక్తులు ఓ వ్యక్తిపై దాడి చేసి గాయపరిచిన ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... నడికట్టు అరవింద్‌రెడ్డి ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ రామలింగేశ్వరనగర్‌లోని కొల్లిపరవారి వీధిలో తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్నాడు. బుధవారం తెల్లవారుజామున అరవింద్‌రెడ్డి మద్యం తాగి తన స్నేహితుడు శంకర్‌తో కలిసి టిఫిన్ చేసేందుకు సిటీ బస్టాండ్ వద్ద ఉన్న గంగోత్రి హోటల్ వద్దకు వెళ్లాడు. ఆ సమయంలో ఆ పక్కనే ఉన్న బడ్డీ వద్ద నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నలుగురు వ్యక్తులు పమిడిముక్కల జ్యోతి అనురూప్ అలియాస్ జాన్, ఇంద్రగంటి రజినీకాంత్, శ్రీకాంత్, రాజ్‌కుమార్ మద్యం తాగి ఉన్నారు. బడ్డీ వద్దకు వెళ్లి సిగరేట్ ఇవ్వమని అరవింద్ వారిని అడిగాడు. బడ్డీకి మాకు సంబంధం లేదు మమ్ములను ఎందుకు అడుగుతావంటూ అరవింద్‌తో గొడవపడ్డారు. వారి మధ్య మాటమటా పెరిగి జ్యోతి అనురూప్‌ను తోయడంతో కిందపడ్డాడు. కోపోద్రిక్తుడైన అనురూప్ అతని వద్ద ఉన్న కత్తితో అరవింద్ పొట్టలో పొడిచాడు. వెంటనే అక్కడ నుంచి వారు పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తీవ్రరక్తస్రావమై గాయపడిన అరవింద్‌ను ఆసుపత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న వారి కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆసిఫ్



ఆసిఫ్‌కు మద్దతుగా కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్లు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలన సాగిందని, మళ్ళీ వైఎస్సార్ సీపీకే ఓట్లు వేయాలని పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్. ఆసిఫ్ తెలిపారు. 46, 48వ డివిజన్లలో బుధవారం గడప గడపకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. 46వ డివిజన్‌లో కలరా హాస్పటల్ నుంచి మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి ప్రారంభించారు. కేఎల్‌రావునగర్, లంబాడీపేట గాంధీబొమ్మ సెంటర్, వీఎంసీ కాలనీ, కేఎల్‌రావు పార్కు రోడ్డు, రాజీవ్‌శర్మనగర్ ప్రాంతాల్లో పర్యటన సాగింది. ఆయా ప్రాంతాల్లో ప్రతి ఇంటికి వెళ్లి జగన్ ప్రభుత్వ హయాంలో అందుతున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. అర్హతే ప్రామాణికంగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను అందిస్తుందని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగున్నర ఏళ్ల కాలంలో చేపట్టిన పథకాలతో రూపొందించిన కరపత్రాలను అందిస్తూ మళ్లీ వైఎస్సార్ సీపీకే ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో పశ్చిమ నియోజక వర్గానికి చెందిన పలువురు కార్పొరేటర్లు యలకల చలపతిరావు, పగిడిపాటి చైతన్యరెడ్డి, మహాదేవు అప్పాజీ, అర్షద్, ఆంజనేయరెడ్డి, కోటిరెడ్డి, మైలవరపు రత్నకుమారిలు ఆసీఫ్‌కు మద్దతుగా కార్యక్రమంలో పాల్గొని ముందుకు సాగారు. వివిధ కార్పొరేషన్లకు చెందిన డైరెక్టర్లు, డివిజన్ నాయకులు జలసూత్రం శ్రీనివాసరావు, జి. వెంకట్, విజయ్‌కుమార్, షేక్.ఆదిల్, షాహి, ప్రసాద్, నాగబాబు, జావీద్, రామకృష్ణ, కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఆసిఫ్

48వ డివిజన్‌లో.....

48వ డివిజన్ పరిధిలోని కొత్తపేట ఆంజనేయ వాగు, ఈద్గామహాల్‌రోడ్డు, బంగారయ్య కొట్టు వీధి, బూస్టర్ వీధి, కటికల మస్తాన్ వీధి ప్రాంతాల్లో గడప గడపకు వైఎస్సార్ సీపీ కార్యాక్రమాన్ని నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజక వర్గ ఇన్‌చార్జి షేక్.ఆసీఫ్, కార్పొరేటర్ అత్తులూరి ఆదిలక్ష్మి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. సంక్షేమ పథకాలు మరిన్ని తీసుకురావాలన్నా, పథకాల అమలు కొనసాగాలన్నా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరో మారు సీఎం కావాలని కోరారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం కోసమే నిరంతరం పని చేస్తుందని పేర్కొన్నారు. అత్తులూరి పెదబాబు, డివిజన్ అధ్యక్షుడు పిళ్లా సూరిబాబు, అయితా కృష్ణ కిశోర్, యంగల శ్రీనివాస్, కోళ్ల రజనీ, వానపల్లి త్రిమూర్తులు, దుక్కా దుర్గారావు, జగదీష్, వెంకటలక్ష్మీ, వరలక్ష్మీ, అమర్‌నాథ్, ఆర్. శ్రీను, గాలి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

బీసీలను అవమానించిన దుర్మార్గుడు చంద్రబాబు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్



ఆసిఫ్‌ను సత్కరిస్తున్న నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బీసీ వర్గాలను అడుగడుగున అవమానించిన దుర్మార్గుడు చంద్రబాబు అని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త షేక్ ఆసిఫ్ అన్నారు. ఏపీ నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మాల్కపురం కనకారావు ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన నాయీ బ్రాహ్మణులు బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిని పార్టీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో షేక్ ఆసిఫ్ పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా పని చేసిన 14 సంవత్సరాల్లో బీసీలను పూర్తిగా అణగదొక్కారని చెప్పారు. బీసీల ఎదుగుదలను అడ్డుకున్నారని దుయ్యబట్టారు. నాయీ బ్రాహ్మణులను తోకలు కట్ చేస్తానంటూ బెదిరించిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే దళిత, మైనార్టీ వర్గాలనూ ఆయన చిన్నచూపు చూశారని మండిపడ్డారు. కానీ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి అడుగులోనూ బీసీలను పెద్ద పీట వేశారన్నారు. 50కు పైగా బీసీ కార్పొరేషన్లను ఏర్పాటు చేసి రాజ్యాధికారంలో వారిని భాగస్వాములను చేశారని వివరించారు. ప్రధానంగా నాయీ బ్రాహ్మణులకు ఆలయాల్లో ప్రాధాన్యతనిచ్చే విధంగా జగన్ ప్రభుత్వం మార్పును తీసుకొచ్చిందన్నారు. ప్రతి ఆలయంలోనూ ధర్మకర్తగా నియమించే దిశగా చర్యలు తీసుకున్నారన్నారు. బీసీలకు ఉపముఖ్యమంత్రి పదవిని ఇవ్వటమే కాకుండా మంత్రి వర్గంలో సగానికి పైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అవకాశాన్ని కల్పించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ నగర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పైడాడ శ్రీనివాసరావు, వివిధ ఆలయాల సభ్యులు ద్రాక్షారపు రాము, టి.చంద్రశేఖర్, నాయకులు నాగరాజు, గణేష్, రాజశేఖర్, పొన్ని తదితరులు పాల్గొన్నారు.

ఫన్ సిట్టింగ్ ఏరియాలో థియేటర్

నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



పార్క్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): రివర్ ఫ్రంట్ ప్లాజా పార్క్‌లో ప్రజలకు మరింత ఆనందాన్ని కలిగించే థియేటర్‌ను ఫన్ సిట్టింగ్ ఏరియాలో నిర్మించాలని, ముఖ్యంగా ముఖద్వారం గ్రీనరీతో ఆకట్టుకునే విధంగా ఉండాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. రాణిగారితోటలో పర్యటించి రిటైనింగ్ వాల్ వెంబడి పార్క్ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. కృష్ణానది ఫేస్–2 రిటైనింగ్ వాల్ వెంబడి కనకదుర్గ వారధి నుంచి పోలీస్ కాలనీ డీపీ స్టేషన్ వరకు 1.2 కి.మీ పొడవున సుమారు రూ.7.8 కోట్లతో నిర్మాణం జరుగుతున్న ఆహ్లాదకరమైన రివర్ ఫ్రంట్ బ్యూటిఫికేషన్ పార్కును ప్రజలకు త్వరలో అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ట్రీ కెనాపీ ప్రజలను ఎంతగానో ఆకర్షిస్తుందన్నారు. ప్రజలను మరింత ఆకర్షించేందుకు నిర్మాణం దశలో ఉన్న వాకింగ్ ట్రాక్, పాత్ వే, డిజైన్లు పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. పార్క్ నిర్మాణ పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో వీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ మతోన్మాద విధానాలు ఓడిద్దాం

సీఐటీయూ ఆలిండియా ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్



కృష్ణలంక(విజయవాడతూర్పు): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్ మతోన్మాద విధానాలను ఓడించాలని సీఐటీయూ ఆలిండియా ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ పిలుపునిచ్చారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో బుధవారం ఫెడరేషన్ ఆఫ్ మెడికల్ రిప్రజెంటేటివ్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎంఆర్ఏఐ) జాతీయ కౌన్సిల్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా పాల్గొన్న తపన్‌సేన్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగాన్ని ప్రైవేట్‌కు అప్పగిస్తుందని చెప్పారు. కార్పొరేట్లకు మాత్రం మోదీ ప్రభుత్వం అన్ని విధాలా మేలు చేస్తుందన్నారు. దేశ ప్రజల సమస్యలు పక్కదోవ పట్టించటానికి మతాన్ని వినియోగిస్తుందని పేర్కొన్నారు. ఈ వాస్తవాన్ని గమనించి ప్రజానుకూల విధానాల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఫార్మా యాజమాన్యాలు ప్రజారోగ్యంపై లాభాలు సంపాదిస్తున్నాయని, కానీ మెడికల్ రిప్స్ సమస్యలు పట్టించుకోవడంలేదన్నారు. ప్రభుత్వ విధానాలు కూడా దీనికి కారణమేనని తెలిపారు. ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా జరిగే గ్రామీణ బంద్‌ను, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. మెడికల్ రిప్స్ ఈ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలన్నారు. సమావేశాల్లో అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు రమేష్ సుందర్, సీఐటీయూ ఆలిండియా కార్యదర్శి కరుమలయన్, సీఐటీయూ ఆలిండియా నాయకుడు జేఎస్ మజుందార్, బెఫి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.అజయ్‌కుమార్, డాక్టర్ పూర్ణానంద్, శంతనకుమార్, ఏవీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దత్తసాయి మందిర వార్షికోత్సవాలు ప్రారంభం



మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో బుధవారం మందిర 9వ వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 5.15 గంటలకు కాగడా హారతి, విఘ్నేశ్వర పూజతో వేడుకలు ప్రారంభించారు. లోక కళ్యాణార్థం బాబావారికి విశేషంగా పలు పండ్లరసాలు, దివ్య ద్రవ్యములతో అభిషేకం చేశారు. భక్తమండలి ఆధ్వర్యాన ఓం సాయి శ్రీసాయి జయ జయ సాయి అఖండ తారక నామ మహామంత్ర పారాయణం చేశారు. శ్రీసాయినక్షత్రమాలిక మండలి ఆధ్వర్యాన హనుమాన్ చాలీసా, బాబా పారాయణం జరిగింది. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు బాబాను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను మందిర వ్యవస్థాపకులు తంగెళ్ళమూడి వీరమోహనరావు పర్యవేక్షించారు.

జిలానీఖాన్ సేవలు వెలకట్టలేనివి



జిలాన్‌ఖాన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

విజయవాడ కల్చరల్: సాంస్కృతిక, కళారంగానికి జిలానీఖాన్ చేసిన సేవలు వెలకట్టలేనివని మురగా చారిటబుల్ సంస్థ నిర్వాహకుడు రమాశంకర్ అన్నారు. మురగా చారిటబుల్ సంస్థ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంస్కృతిక సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సాంస్కృతిక రంగ ప్రముఖుడు జిలానీఖాన్ సంస్మరణ సభ గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద బుధవారం నిర్వహించారు. రమాశంకర్ జిలానీఖాన్ సేవలను వివరించారు. విశ్రాంత పోలీస్ అధికారి డేవిడ్ రాజు మాట్లాడుతూ ఆయన ఎంతోమంది యువ కళాకారులకు వేదిక కల్పించారని చెప్పారు. కార్యక్రమంలో బీవీ వీరభద్రరావు, చింతకాయల చిట్టిబాబు, మారేపల్లి జోషి, జిలానీ ఖాన్ మిత్రులు ఆయనతో అనుబంధం గుర్తు చేసుకున్నారు. కృష్ణ సింధు, కృష్ణకుమారి, విజయశ్రీ గుప్తా, శ్యాంప్రసాద్, దండు చంద్రశేఖర్ రామాంజనేయులు, టి.శ్రీనివాసరెడ్డి చిత్రగీతాలను ఆలపించారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు జిలానీఖాన్ చిత్రపటానికి నివాళులర్పించారు.

ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ



లబ్బీపేట(విజయవాడతూర్పు): జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9న జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏడాది నుంచి 19 ఏళ్లలోపు వారందరికీ ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వనున్నారు. అందులో భాగంగా పాఠశాలలు, అంగన్‌వాడీలను మాత్రలను పంపిణీ చేసేందుకు బుధవారం మండల అభివృద్ధి అధికారులు, విజయవాడ జోనల్ కమిషనర్‌లకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. ఈ మాత్రలను ప్రతి అంగన్ వాడీ కేంద్రానికి, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా ఆశాలు, ఆరోగ్య కార్యకర్తలు విద్యాశాఖ ఉపాధ్యాయులతో కలిసి ఈ నెల 9న డీ వార్మింగ్ కార్యక్రమం చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ అమృత, అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ జె ఉషారాణి, ఆర్‌బీఎస్‌కే అధికారిణి డాక్టర్ మాధవి, డీఎంఓ డాక్టర్ మోతీబాబు, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇందుమతి, డీపీఎంఓ డాక్టర్ నవీన్ తదతరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): సంక్రాంతి సమయంలో భోగి మంటలో పడి తీవ్రగాయాలైన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ప్రైజర్‌పేటకు చెందిన పోలిపల్లి బంగార్రాజు (36) గత నెల 14వ తేదీన ప్రమాదశాత్తు ఇంటి ముందు వేసిన భోగి మంటల్లో పడ్డాడు. కుటుంబ సభ్యులు బంగార్రాజును ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న బంగార్రాజు బుధవారం మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

యువకుడి అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): షాపునకు వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అన్న ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పంజా సెంటర్‌కు చెందిన తాడిశెట్టి వీరయ్య, దుర్గారావులు అన్నాదమ్ములు. దుర్గారావు మంగళగిరిలో బంగారపు పని చేస్తుంటాడు. ఈ నెల 5వ తేదీన షాపునకు వెళుతున్నాని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన దుర్గారావు సాయంత్రం అయినా తిరిగిరాలేదు. షాపులోని తోటి పని వారిని ఆరా తీయగా దుర్గారావు పనికి రాలేదని తెలిసింది. దీంతో ఆందోళన చెందిన అన్న వీరయ్య పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

భక్తులకు మెరుగైన సౌకర్యాలు : భరద్వాజ్

తిరుమలగిరి(జగ్గయ్యపేట): ఆలయంలో భక్తులకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు ఆలయ చైర్మన్ కొమరగిరి రవీంద్ర భరద్వాజ్ తెలిపారు. గిరి ప్రదక్షిణ రహదారిని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఆలయం కావడంతో నిత్యం భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు కల్పిస్తున్నామని వివరించారు. రూ. కోటితో చేపట్టిన గిరిప్రదక్షిణ రహదారిని త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.

నులి పురుగుల నుంచి చిన్నారులను కాపాడుకుందాం

మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఆవరణలోగల కొత్త భవనంలోని కాన్ఫరెన్స్ హాల్లో మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం సాయంత్రం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన నులిపురుగుల వలన జరిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగుల నివారణకు ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసు కలిగిన ప్రతి విద్యార్థికీ ఈ నెల 9వ తేదీ నుంచి ఆల్బెండజోల్ మాత్రలు కచ్చితంగా చేరేలా చూడాల్సిన బాధ్యత పాఠశాలల యాజమాన్యానిదేనని పేర్కొన్నారు. ఎంఈఓలు ప్రతి స్కూల్‌కు వెళ్లి పిల్లలతో ఆల్బెండజోల్ మాత్రలు వేసే కార్యక్రమాన్ని యాజమాన్యం చేపట్టేలా చూడాలని ఆదేశించారు. సమాచారాన్ని విద్యార్థుల డైరీలో రాయడం ద్వారాగానీ వాట్సప్ గ్రూప్‌లో పెట్టడం ద్వారాగానీ వారి తల్లిదండ్రులకు తెలియ చేయాలన్నారు. నులిపురుగుల నుంచి చిన్నారులను కాపాడుకుందామని పిలుపునిచ్చారు. విద్యార్థులలోనూ నులిపురుగుల వలన కలిగే రక్తహీనత, ఆకలి మందగించడం, తరచూ విరేచనాలు కావటం, బరువు తగ్గటం వంటి నష్టాలను వివరించాలని కమిషనర్ సూచించారు. అందుకు తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి అంటే... అంటే గోళ్లు శుభ్రంగా ఉంచుకోవడం, బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన చేయకుండా ఉండటం, అటువంటి ప్రదేశాల్లో సంచరించకుండా ఉండటం వంటివి చేయాలని విద్యార్థులకు అవగాహన కల్పించాలని వివరించారు. అలాగే విద్యార్థులు వినియోగించే కామన్ బాత్‌రూమ్స్ వలన సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నందున ప్రతి విద్యార్థికి ఒకేసారి సింగిల్ షాట్‌లో ఆల్బెండజోల్ మాత్రలు వేయడం వలన నులి పురుగులతో వచ్చే వ్యాధులను అరికట్టవచ్చని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని సంరక్షించే బాధ్యత ప్రతి ఉపాధ్యాయునికి ఉందన్నారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ (జనరల్) కె.శకుంతల, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, ఎంఈవోలు, స్కూల్ సూపర్‌వైజర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కత్తులతో బెదిరించి దోపిడీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళను కత్తులతో బెదిరించి బీరువాలోని రూ. 1.50 లక్షల నగదు, 37 గ్రాముల బంగారాన్ని దోపిడీ చేసిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. హైదరాబాద్ మల్లాపూర్‌కు చెందిన ఆర్. శోభ శుక్రవారం కొత్తపేటలో ఉంటున్న చెల్లెలు కవిత ఇంటికి వచ్చింది. కవిత గొల్లపూడిలోని షాపులో పని చేస్తుండగా, భర్త అప్పారావు బైండింగ్ పని చేస్తుంటాడు. కుమార్తె కీర్తి కాలేజీలో చదువుకుంటుంది. బుధవారం మధ్యాహ్నం కవిత, అప్పారావులు ఎవరి పనికి వారు వెళ్లగా, కీర్తి కాలేజీకి వెళ్లింది. మధ్యాహ్నం ఇంట్లో ఒంటరిగా ఉన్న శోభకు తలుపు కొట్టిన చప్పుడు కావడంతో బయటకు వచ్చింది. ఇద్దరు వ్యక్తులు శోభ వద్దకు వచ్చి ఇంట్లో అప్పారావు ఉన్నాడా అని అడిగి లోపలకు బలవంతంగా ప్రవేశించారు. లోపలకు రావడంతోనే తలుపులకు లోపల నుంచి గడియ పెట్టి కత్తులు చూపించి బంగారం, డబ్బులు ఎక్కడ ఉన్నాయని ప్రశ్నించారు. చెప్పకపోతే చంపుతామని బెదిరించడంతో లోపల గదిలో బట్టల కింద ఉన్న అలమరాలో ఉన్న తాళాలు చూపింది. దీంతో ఇద్దరిలో ఒక వ్యక్తి శోభను పట్టుకుని ఉండగా, మరో వ్యక్తి బీరువా తాళాలు తీసి లోపల ఉన్న డబ్బు, నగలు తీసుకుని పారిపోతూ బయట తలుపులకు గడియ పెట్టారు. కొంత సమయానికి కీర్తి కాలేజీ నుంచి వచ్చి తలుపు తీయడంతో విషయం బయటకు వచ్చింది. ఘటనపై కవితకు ఫోన్‌లో చెప్పగా హుటాహుటిన ఇంటికి తిరిగి వచ్చేసింది. బీరువాలో సుమారు 37 గ్రాముల బంగారపు వస్తువులతో పాటు రూ. 1.50 లక్షల నగదు చోరీ చేసి తీసుకెళ్లినట్లు బాధితురాలు ఫిర్యాదు చేసింది. ఘటనపై పోలీసులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దొంగలు ఇంటి గురించి పూర్తిగా తెలిసిన వారే అయి ఉంటారని భావిస్తున్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో అభినయ ఆర్ట్స్ అకాడమీకి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట కళావేదికపై శ్రీవైష్ణవి, వాహికా విజయ్, యశస్విని, యితీక, తన్మయి, హరిణిలతో పాటు మరి కొంత మంది చిన్నారులు పలు కీర్తనలకు చక్కటి అభినయంతో కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందచేశారు.